3వ వారం.. బుర్ర రాములు

# తొవ్వ కోసం



(గత సంచిక తరువాయి)

"ఏమిరా ఎల్లేష్ సర్పంచిగాడికే తెల్వకుంట నీవు ఎంక్వాయిరీ ఏందిరా చేసేది? గా తొవ్వ గురించే రెండు నక్సలైట్లు పార్టీలు తన్నుకుంటున్నాయి గదరా! మీరేందిరా! మూడో నక్సలైట్లరా!

'కాదు ఈ ఊరి వాళ్ళం, మా ఊరికి కావలసిన తొవ్వ గురించి ఇంత గొడవెందుకు అయితుందో కారణం తెలుసుకోవాలనుకున్నాము. అన్నల పార్టీలకు నిజాలు చెప్పకుండా రెండు గ్రామాల నాయకులు మోసం చేస్తున్నారు. వాటన్నింటిని ప్రజల ముందు పెట్టాలనుకున్నాము...' ఎల్లేష్ రొప్పుతూ చెప్పాడు.

'ఏంరా పంతులు. నీ తెల్వి పక్కకు పెట్టు. అన్నలు మంచోల్లేగాని వాళ్ళకు నిజాలు తెల్వక తప్పుదోవ పట్టిండ్లంటవు... భలే గుందిర- నీ కత. అయితె నీవ పెద్ద నక్సలైట్లవన్నమాట'

'నీవిట్ల నిజం చెప్తవురా! పంతులూ! నీ స్టూడెంట్లు జవాబులు చెప్పకుంటే ఏం జేస్తవురా! గోడకుర్చీ ఏసిస్తవు కదా! ఇప్పుడు నిన్ను విమానం ఎక్కిత్తమురా!' అంటూ జవాన్లకు సైగ చేసి చెప్పిండి C.I

వెంటనే నలుగురు జవాన్లు ఎల్లేష్ను పట్టుకుని వెల్లకిలా పండుకోబెట్టారు. తొడల మీద ఒకడు కూర్చున్నాడు. చేతులు వెనక్కి విరిచిపట్టుకున్నాడొకడు. ఇద్దరూ చెరొక కర్ర పట్టుకుని పాదాలను పైకి ఎత్తిపట్టుకుని పాదాలపై కొట్టడం ప్రారంభించారు. ఊహించని ఈ పరిణామానికి ఎల్లేష్ శరీరం తట్టుకోలేక పోయింది. పాదాల నుండి రక్తం కారుతోంది. కొద్దిసేపు కొట్టడం ఆపారు. ప్రజలు ఆ హింసను చూడలేక తలలు క్రిందకు వేలాడేశారు. అంతా నిశ్శబ్దం. ఎల్లేష్ మూలుగులు తప్ప వేరే శబ్దం ఏదీ లేదు. దూరాన లూనా వస్తున్న శబ్దం మెల్లగా వినపడింది. పోలీసులు అటు చూశారు. ఎవరో ఇటే వస్తున్నారు. శబ్దం పెద్దగా వినపడే దూరంలోకి వచ్చింది. వచ్చేది ఎవరో తెల్సింది. గట్టయ్య.

రెండు గ్రామాల ప్రజలూ, పోలీసులూ రెండు బాటల నడుమ జమకావడం చూసి కీడు శంకించాడు. లూనా పోలీసులున్న చోటుకు కొద్ది దూరంలోనే ఆపి నడిచిపోయాడు.

'ఆ రావయ్య గట్టయ్యా రా!'

గీనీడు ఎవడో జర చెప్పు?- సి.ఐ

"మా ఊరివాడే -ఎల్లేష్" మూలుగుతూ వెల్లకిలా పడిఉన్న ఎల్లేష్ను చూస్తూ అన్నాడు గట్టయ్య.

"ఆ ఎల్లేష్! కాని వీడు నక్సలైటా కాదా? అదిసరేకాని నువు ఎక్కడికి పోయినావ్? ఎలిశాలకా?

అన్నలు కలిసిండ్లా రాత్రి జరిగిందంతా చెప్పుకున్నావా?"

సి.ఐ అడిగిన ప్రశ్నలకు ఏమి జవాబివ్వాలో తోచలేదు గట్టయ్యకు.

"చెప్పరా సర్పంచి! చెప్పు".

"చిట్యాలకు పోయిన. మా బి.జె.పి నాయకునికి జరిగిందంతా చెప్పిన అంతేకాని ఎలిశాలకు పోలేదు"-గట్టయ్య.

ఓహో ఏడిరా మరి నీనాయకుడు? ఎందుకురా నఖ్రాల్ చేస్తావ్, మూరన్నను కలవడానికి పోయినావ్, జరిగిందంతా చెప్పుకున్నావ్. ఇగో నిన్న ఎల్లేష్ గాన్ని వాళ్ళు పంపించిండ్లు. వాడు మాకు దొరికిండు! అంతే కదరాబిడ్డా! అని బుర్రలో మెదిలే ప్లాన్కు మెరుగులు దిద్దుతూ -'ఆ కానియ్యి నీనిసని...'

"అరే ఎల్లేష్ నీవు పోరగాండ్లకు వాలీబాల్ ఆటనేర్పుతవ్కదూ.. ఇప్పుడు చూడరా మా వాళ్ళు

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 30.8.96



ఆటాడుతారు!" అని సైగచేసాడు. సైగ యొక్క అర్థం, ఉద్దేశ్యం తెలిసిన నలుగురు కానిస్టేబుళ్ళు పరుగున వచ్చి ఎల్లేష్ కాళ్ళు, చేతులు ఒక్కొక్కరు పట్టుకుని గాలిలోకి లేపారు. అటు ఇటు ఊపారు. ఒళ్ళంతా గాయాలతో రక్తం కారుతుండగా మూలుగుతున్న ఎల్లేష్‌కి ఏమి జరుగుతుందో తెలియడంలేదు. గాలిలో తేలిపోతున్నట్టుగా వుంది. కళ్ళు మూసుకుపోతున్నవి. ఒళ్ళు గిరగిరా తిరుగుచున్నది. ఎల్లేష్‌ని అటు ఇటు ఊపి ఒక్కసారే పైకి విసిరివేశాడు.

పైకి వెళ్ళలేక ధబాలున కిందపడి పోయిండు ఎల్లేష్.

'అమ్మా!' గావుకేక వేశాడు.

ఊహించని ఈ దృశ్యం అందర్నీ కలచివేసింది.

మేము చూసేది ఏమిటి? ఇంత ఘోరాన్ని తాము కళ్ళారా చూడవలసివస్తుందని కలలో కూడా ఊహించలేదు! నోట మాటెందుకు రావటంలేదు? ఎవరూ ఏమి మాట్లాడరే.

జవానులు పడిపోయిన ఎల్లేష్ చుట్టూ ఎగిరారు. మళ్ళీ ఒక్కసారి పట్టుకొని ఇందాకటి లాగే గాలిలో ఊపి విసిరివేశారు. ఈసారి ఎలాంటి మూలుగూ లేదు. తల నుండి రక్తం కారుతూనే వుంది. నిత్యం ఇలాంటి చిత్రహింసల క్రీడల్లో రాటుదేలిన పోలీసులకు సంతోషంతో రక్తం పరుగులు తీస్తున్నది. చూస్తున్న ప్రజల రక్తం సలసలా మరుగుతున్నది. కాని నోట మాట పెగలడంలేదు.

ఒక కానిస్టేబుల్ చేయిపట్టిచూసాడు. ముక్కు దగ్గర వేలు పెట్టి చూశాడు. 'సార్ చనిపోయినట్టుంది సార్'.

'అయితే ఆట పూర్తిచేయండి' అన్నాడు సి.ఐ

గబగబా ఎల్లేష్‌ని లేపి కొద్ది దూరంలో ఉన్న మోదుగు చెట్లదగ్గర పడుకోబెట్టి రివాల్వర్‌తో ఛాతిలో రెండు గుండ్లు దించారు.

"సార్! సార్ ఎన్‌కౌంటర్‌లో నక్సలైట ఖతం సార్"..అంటూ పరుగెత్తుకుంటూ వచ్చాడు కానిస్టేబుల్.

"ఈ విన్నారు కదా! ఎల్లేష్ ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడు! ఇప్పటివరకు మీరు ఎల్లేష్‌కు, పోలీసులకు జరిగిన ఎదురుకాల్పులను చూసారు. మావాండ్లు ఎంత వీరోచితంగా పోరాడిండ్లో తెలుసుకదా!...ఎవడన్నా నిజం చెప్పిండ్లో ఈ విధంగానే బుద్ధిచెబుతాము జాగ్రత్త. అందరూ వెళ్ళిపోండి" అన్నాడు సి.ఐ

జనం ఎవరూ కదలలేదు. ఎందుకు వెళ్ళిపోవాలో తెలియరావడంలేదు.

"ఏం మీకు కూడా విమానం ఎక్కించాల్నా?"

"ఏంరా లీడర్లూ! అందర్నీ పంపించి మీరిద్దరుండండి" అని రామయ్య, గట్టయ్యలను చూస్తూనే లాఠీపట్టుకొని 'వెళ్ళండి' 'వెళ్ళండి' అంటూ కాళ్ళపై కొడ్తూ తరిమారు.

రామయ్య, గట్టయ్య మౌనంగా ఒకరి మొఖం ఒకరు చూసుకుంటూ నిలబడ్డారు.

వైర్‌లెస్‌సెట్ ద్వారా ఎన్‌కౌంటర్ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపాడు డి.ఎస్.పి

జీపు కదిలింది. శవం దగ్గర నలుగురు కానిస్టేబుళ్ళు కాపలా ఉన్నారు.

## (2)

ఊ...అబ్బా...ఒదలండి...వన్నొదలండి...పెనుగులాడుతున్నాడు శక్తినంతాకూడగట్టుకొని మీదపడుతున్నవాళ్ళను దూరంగా నెట్టాలని ప్రయాసపడుతున్నాడు. కానీ చేయలేకపోతున్నాడు...ఒదలండి.. మీకే చెప్పేది...ఎవరు మీరు? నన్నెందుకు పట్టుకోవాలనుకుంటున్నారు? ...చెప్పండి...దబ్..'అబ్బా' అని కళ్ళు విప్పిచూసాడు. కిందపడ్డాను! ఏమైంది? ఎందుకు కింద పడ్డాను?

గొంతు తడారింది! నాలుక పిడచకట్టుకుపోతుందేమిటి? అనుకుంటూ లేచి కుండలో నీళ్ళు ముంచుకొని తాగాడు. చెంబెడు తాగినా దాహం తీరలేదు....ఎందుకు? ఈకల? 'టైమెంతైందీ' అనుకుంటూ వాచీ చూసాడు. అయిదున్నర అవుతోంది 'ఆ..తెల్లవారిందే! అరెరె ఆరుగంటలకే బస్సు. ఏమిటీ మొద్దు నిద్ర? ఏమిటో పీడ కలలు? నన్నెవరో వెంటాడినట్టు. తెల్లారిగట్ల వచ్చే కల నిజమౌద్దట!' అమ్మ ఎప్పుడో అన్నమాట గుర్తుకొచ్చింది. అయితే ఈ కల అర్ధమేమిటి ? అసలు కలలకు అర్ధాలుంటాయా? వ్యర్ధమయిన ఆలోచనలు.

రాత్రి సర్దిపెట్టుకోవడం మంచిదైంది. లేకుంటే బస్సు తప్పిపోయేది అనుకుంటూ బ్యాగు తీసుకొని రూముకు తాళం వేసి జమ్మికుంట బస్సుస్టాండుకు చేరాడు.

ఏమిటి బస్సుస్టాండు ఇలావుంది? ఒక్క బస్సు కూడాలేదేమిటి? పీనుగ పోయినంక ఉండే కొంపలాగుంది.! అనాధ శవాన్ని తొంగి చూసినట్లుగా ఎవరో ఎంక్వయిరీ కిటికీ చువ్వలు పట్టుకొని తొంగి చూస్తున్నారు. తనూ వెళ్ళాడు. ఎవరూ లేరు. ప్యాడుకు చార్టు వుంది. దాన్ని తీసుకొని చూశాడు. ఒక్కబస్సు వచ్చిపోయినట్లు కూడా లేదు. అంటే వావిలాల బస్సు ఇంకా రాలేదన్నమాట. 'హమ్మయ్య'...అరె ఏదోబస్సు వస్తుందే! హారన్ కొట్టుకుంటూ బస్సు వచ్చి ఆగింది. బోర్డులేదే! ఆ.ఆ.ఏదోబోర్డు వేస్తున్నాడు. నాబస్సే వావిలాల బస్సే. బస్సు ఎక్కబోయాడు. లోపలినుండి కండెక్టర్ దిగుతూ నన్ను'ఇంకొక పది నిమిశాలాగుద్ది చాయ్ తాగిరండి' అన్నాడు. తాను తాగొస్తాననక నన్ను తాగిరమ్మంటాడేమిటి?...నేను చాయ్ తాగను. పేపరు చూస్తాను.

ఇగో ఓ పేపరిలాయివ్వు...ముందు జిల్లాపేజి చూడాలా. పేపరు చూస్తూ బస్సు మిస్సయితే ఎలా? బస్సుదగ్గరే నిలబడి చదువుతాను. పేపరు తీసుకొని మొదటిపేజీ చూశాను. 'జైన్ డైరీలో ప్రధానమంత్రి పేరు!'

'అవ్వ కావాలా బువ్వకావాలా?' టీస్టాలు నుండి టేపురికార్డరు పాట చెవుల్లో దూసుకుపోయింది.

దేశమంతా హవాలా! హవాలా కుంభకోణాలైతే వీడిగోలేమిటి...'అవ్వా కావాలా బువ్వకావాలా?'



'హవాలా కావాలా? దివాలా కావాలా?' అని పాడుకోవాలి?

'కుంభకోణాలు, బోఫోర్సులు హవాలాలు లేని ప్రధాన మంత్రులు కరువాయె' నిజానికి హవాలా ముడుపులు అందుకోని రాజకీయ పార్టీలే లేవాయె!' ఆ ... ఈ పేపరంతా హవాలా మీదనే ఉంది. ఇది మనకు అవసరం లేదు. జిల్లా పేజి చూద్దాము... ఇక్కడేదో ఎన్‌కౌంటర్ వార్త ఉండే అని పేపరు మడత పెట్టబోయి ఆపి చదివాడు.

'బూర్నపల్లి గుట్ట దగ్గర ఎన్‌కౌంటర్‌లో మరణించిన నక్సలైట్'. ఫొటో క్రిందగల వాక్యం తనలో ఆతృతను పెంచింది. ఫొటోలోని మొఖం సరిగా కనిపించడం లేదు. బూర్నపల్లి అంటే నా బూర్నపల్లి కాదుగదా! చనిపోయింది ఎవరు? అనుకుంటూ వార్తను చదివాడు.

'శనివారం ఉదయం 7 గంటలకు వరంగల్ జిల్లాలోని చిట్యాల మండలం బూర్నపల్లి గ్రామ గుట్ట దగ్గర జరిగిన ఎదురు కాల్పుల సంఘటనలో తీవ్రవాది ఎల్లేష్ మరణించినట్లుగా ఎస్.పి. ప్రకటించాడు.'

చేతిలోని పేపర్ వణికి పోయింది. గుండె వేగం పెరిగింది.

'శుక్రవారం రాత్రి వెంకన్న దళం నక్సలైట్లు 20 మంది గట్టయ్య పొలాన్ని ఎడ్లబండ్లతో తొక్కించిన సంఘటన పూర్వాపరాలను విచారించడానికి పోలీసులు వెళ్ళారు. రాత్రి జరిగిన ఘటనలపై సమాచారం సేకరించుకొని వస్తుండగా గుట్ట దగ్గర పొంచి ఉన్న నలుగురు నక్సలైట్లు పోలీసులపై గ్రెనైడ్ విసరగా, ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన కాల్పుల్లో వెంకట్రావుపల్లికి చెందిన మిలిటెంట్ కె.ఎల్లేష్ అక్కడికక్కడే చనిపోయాడని, మిగతా ముగ్గురు పారిపోయారని పోలీసు అధికారులు తెలిపారు.'

పోలీసులు ఎదురు కాల్పులుగా చెప్పే ఈ ఘటనపై ప్రజలు ఎవ్వరూ నోరు మెదపడం లేదు.

కానా ఇది బూటకపు ఎదురుకాల్పుల ఘటనగానే మృతుని తల్లిదండ్రులు విలపిస్తూ చెప్పారు. తన కొడుకుని ప్రజలముందే హింసించి పోలీసులు చంపి ఎన్‌కౌంటర్ అంటున్నారని తమ కొడుకు తమ చేతికందొచ్చిన ఏకైక మగసంతానంగా విలపిస్తూ చెప్పారు. ఎల్లేష్ మరణంతో కుటుంబం అనాధగా మారిందని తెలిపింది. కళ్ళునీళ్ళతో నిండి చదవలేకపోయాడు. 'ఏమిటీ ఘోరం శుక్రవారం రాత్రి తనతో పడుకొని ఉదయమే లేచి ఇంటికి పోతా అని బయలుదేరిన ఎల్లేష్ ఇల్లు చేరనే లేదా?... ఇలా చనిపోవడం నిజమేనా!... నమ్మలేని నిజం. కాదు ఇది అబద్దం... నేను నమ్మను... నేను నమ్మను. నిన్నటి వరకు నాతోనే ఉన్నాడు. ఇది అబద్ధం...అబద్ధం'.

ఏడుస్తూ పేపరులో మొఖం దాచుకున్నాడు రామక్రిష్ణ.

...హల్లో..నిన్నే.. నిన్నేనయ్యా.. నిన్నే.. అనే అరుపులతో ముఖం మీద కప్పుకున్న పేపరు తీసి చూశాడు. వావిలాల బస్సులోనుండి కండక్టరు తల బయటికి పెట్టి పిలుస్తున్నాడు. 'బస్సు ఎక్కవా? ఇందాక అడిగింది నీవే కదా? అనే ప్రశ్నకు జవాబేమివ్వకుండా నీరసంగా అడుగులు వేస్తూ వెళ్ళి బస్సు ఎక్కాడు. తనెందుకు బయలుదేరాడు? ఎల్లేష్‌ని చూడటానికా? కాదె! తనూ, ఎల్లేష్ కలిసి రెండుగ్రామాల్లో ఉన్న ఇప్పటి తొవ్వ పంచాయతీ పరిష్కరించాలనుకున్నామే. అందుకు ఆ తొవ్వ చుట్టూ అల్లుకున్న చరిత్రను తవ్వి తీసామె, ఎంపేడు భూస్వామి సుధాకర్‌రావు, ఎంచపల్లి భూస్వామి నారాయణరెడ్డిల మధ్య సాగిన పాత ఒప్పందం తాలూకు వివరాలు సేకరించామె. ఈరోజు నిజంగా ఈరోజే రెండుగ్రామాల ప్రజల్ని సమావేశపర్చి 'తొవ్వ' గురించి అన్నలు ఎలా 'దారి' తప్పారో చెప్పాలనుకున్నామె. గట్టయ్య మోసాన్ని, రామయ్య కుత్సితాన్ని బయటపెట్టి ప్రజల్ని ఐక్యం చేయాలనుకున్నామె. ఏమైంది? ఇంతలోనే ఎల్లేష్ లేకుండా ఎందుకు పోయాడు. ఎల్లేష్...ఎల్లేష్. 'దబ్ దబ్'...

రోడ్డు మీదున్న గుంతల నుండి బస్సు వేగం తగ్గకుండా పోవడంతో ఆలోచనలు తెగినవి. కొద్ది దూరం పోయి బస్సు ఆగింది.

ఓసారు! కొద్దిసేపు ఆపవా!' అంటూ చంటి బిడ్డనెత్తుకొని ఓ యువతి గాబరాగా దిగటానికి ప్రయత్నిస్తున్నది. ఆమె మాటను ఎవరూ వినేట్టు లేరు. కింద నుండి తోసుకుంటూ ఎక్కారు. అయ్యో నా పంటోడు చస్తడు. కొద్దిగ నన్ను దిగనియ్యరాదునయ్యా...

అవును పంటోడు చస్తడు. కాదు సచ్చిండు. నా సంటోడు.. సచ్చిండు..

(మిగతా వచ్చేవారం)